ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
గురువారం 26 సెప్టెంబరు 2024


ఆక్రమణకు గురవుతున్న హనుమకొండలోని పులిగుట్ట

మహానగరంలో భూ మాయగాళ్లు చెలరేగిపోతున్నారు. వరంగల్ ట్రై సిటీస్‌లో సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు ఫెన్సింగ్ వేసి చుట్టేస్తున్నారు. పోరుగు భూముల సర్వే నెంబర్లతో రూ.కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోతున్నారు. కొన్నాళ్లుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌తో పాటు సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలతో పాటు చోటామోటా నేతలు గుట్టలను తవ్వేస్తూ.. ఖాళీస్థలాల్లో దర్జాగా తిష్టవేస్తున్నారు. అడుగు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతేనే ఆగమాగమయ్యే అధికారులు పులిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.200కోట్లకు పైగా విలువైన భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సైన్స్ సెంటర్ భూములు స్వాహా!


- మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు, తాజా, మాజీ కార్పొరేటర్ల హస్తం
- హంటర్‌రోడ్డులోని సర్వే నెంబరు 964, 966లో 49ఎకరాల ప్రభుత్వ భూమి
- 2015లో టైగర్స్‌హిల్స్‌పై 15ఎకరాల్లో సైన్స్ సెంటర్ ఏర్పాటు
- ఆ కేంద్రంతో పాటు పదెకరాలకుపైగా సర్కారు స్థలాల అన్యాక్రాంతం
- పక్క సర్వే నెంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు.. దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పులిగుట్ట పరిసర ప్రాంతాల భూములపై సర్వే చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..


సర్వే నెం.964లో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

కబ్జాకోరల్లో 200కోట్ల విలువైన పదెకరాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉమ్మడి ఓరుగల్లు విద్యార్థులు మరింత అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో 2015లో హంటర్‌రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై 15ఎకరాల్లో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీఎస్‌టీ)ని ఏర్పాటు చేశారు. నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో 69సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో పాటు ఫిజిక్స్, బయోలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం గతంలోనే ప్రభుత్వం రూ.6కోట్లు వెచ్చించింది. తాజాగా మరో రూ.4కోట్లతో సైన్స్ సెంటర్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. నగరం నడిబొడ్డులో ఉండ టంతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉపయో గపడే టైగర్స్‌హిల్స్ గుట్టల భూములపై కబ్జాకోరుల కన్ను పడింది. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లకొడుతున్నారు.


రికార్డుల్లో సర్వే నెం.964, 966లో ప్రభుత్వ భూమిగా నమోదు

రూ.200కోట్ల విలువైన భూములు స్వాహా?

వరంగల్ మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. దీంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తూ దర్జాగా కబ్జా చేస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో వన విజ్ఞాన కేంద్రం, రీజనల్ సైన్స్ సెంటర్‌తో పద్మాక్షి గుడి, సిద్ధేశ్వరస్వామి ఆలయం, జూ పార్కులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం కమర్షియల్‌గా అభివృద్ధి చెం దుతోంది. ఈ ఏరియాలో హనుమకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 964లో 44.37 ఎకరాలు, సర్వే నెంబరు 966లో 4.03ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు సర్వే నెంబర్లలో మొత్తం 49ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో రీజనల్ సైన్స్ సెంటర్ కోసం 2015లో ప్రభుత్వం 14.20ఎకరాల భూమిని కేటాయించింది. సర్వే నెంబర్లు 964, 966లో మొత్తం 49ఎకరాల్లో సైన్స్ సెంటర్‌కు 14.20 ఎకరాల భూమిని కేటాయించగా, మిగిలిన భూమిలో 127 అక్రమ కట్టడాలు నిర్మించి నట్టు గుర్తించారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించటంతో పాటు ఇంటి పన్ను, నల్లాపన్నులు కూడా వసూళ్లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మిగిలిన భూ మికి ఎలాంటి హద్దులు లేకుండా అధికారులు వది లేశారు. ఇందులో శిల్పారామం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేయాలని గతంలో తహసీల్దార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అవి అమలుకు నోచుకోలేదు. కాలక్రమేణా హంటర్ రోడ్డు అభివృద్ధి చెందుతుండటంతో కబ్జారా యుళ్ల కళ్లు టైగర్ హిల్స్‌పై పడింది. గత ప్రభుత్వ హ యంలో కీలక నేతలు ఆదేశాలతోనే వారి అను చరులు హంటర్‌రోడ్డులో ఉన్న ఖాళీగా కనిపిస్తున్న గుట్టతో పాటు చెట్లను, పొదలను తన ఎక్స్‌కవేటర్ యంత్రాలతో ఓ నేత చదును చేసి దర్జాగా కబ్జా చేశారనే ప్రచారం జరుగుతోంది. పక్కనే ఇతర స ర్వే నెంబర్లలో భూములు

▸▸ మిగతా 6వ పేజీలో..


వివరాలు వెల్లడిస్తున్న ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్

చిరుత చర్మం పట్టివేత

- ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

వాజేడు, సెప్టెంబరు 25: చిరుత చర్మాన్ని ఓ వ్యక్తి తరలిస్తుండగా ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీసులు పట్టుకున్నారు. ఏటూరునాగారం ఓఎస్డీ గితే మహేష్ బాబాసాహెబ్ బుధవారం వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చిరుత చర్మాన్ని తీసుకొస్తున్నారనే సమాచారం మేరకు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ బుధవారం మధ్యాహ్నం చంద్రుపట్ల వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం తహసీల్ ఊళ్లరుకు చెందిన జాడి మహేందర్ బైక్‌పై అటు వైపు వచ్చాడు. అతడిని తనిఖీ చేయగా బ్యాగ్‌లో చిరుత చర్మం లభ్యమైంది. దీని నిర్ధారణ కోసం ఎఫ్ఆర్‌వో చంద్రమౌళికి ఎస్సై సమాచారం ఇచ్చారు. దాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్‌వో ఇది ఆడ చిరుత చర్మమని నిర్ధారించారు. దీంతో మహేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వన్యప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు ఓఎస్డీ తెలిపారు. నిందితుడి నుంచి ఒక కీప్యాడ్ మొబైల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చిరత చర్మం విలువ మార్కెట్‌లో ఉపయోగాన్నిబట్టి రూ. 5 లక్షల పైనే ఉంటుందని సమాచారం.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- డీపీవో నారాయణరావు

చిట్యాల, సెప్టెబరు 25 : ప్రజా సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీపీవో నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను నిరంతరంగా కొనసాగించాలని, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, టేకుమట్ల ఎంపీవో సురేష్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక


సుభాకర్‌రెడ్డి


కిరణ్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 25: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పీఆర్‌టీయూ టీఎస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా రేగూరి సుభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుసునపు కిరణ్ ఎన్నికయ్యారు. భూపాలపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో శాసన మండలి ఫ్లోర్ లీడర్ శ్రీకుర రఘోత్తంరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సమక్షంలో ఈ మేరకు ఎన్నుకున్నారు.


మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- జిల్లా జడ్జి నారాయణబాబు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 25: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా జడ్జి పి.నారాయణబాబు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవజీవితంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగానే కాకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రామచంద్రారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్ పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

- ఆర్యవైశ్య సంఘం నేతలు వినతి

కాటారం, సెప్టెంబరు 25: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్య మహాసభ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్, నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కమ్యూనిస్టుల కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును విశ్వవిద్యాలయానికి పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, కోశాధికారి కముటాల రవీందర్, నాయకులు మద్ది కమలామనోహర్, ఎంఎల్ఎన్ మూర్తి, బచ్చు ప్రకాశ్, అల్లాడి శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, దారం నగేష్ తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్యులు

మేడారం అభివృద్ధికి ప్రణాళిక

- రూ.250కోట్లతో కార్యాచరణ
- శాశ్వత ప్రాతిపదికన పనులు
- పనిచేయలేని అధికారులు సెలవు పెట్టండి
- ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే కేసులు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క
- మేడారం మినీ జాతర, రక్షిత తాగునీటి సరఫరాపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 25: మేడారం సమగ్రాభివృద్ధి, సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులకు శాశ్వత ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించేందుకు రూ.250 కోట్లతో కార్యాచరణ రూపొందించామని, త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశాలున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మేడారం మినీ జాతర, జిల్లా ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాపై కలెక్టర్ దివాకరతోపాటు సంబంధిత శాఖల అధికారులతో మంత్రి బుధవారం సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. వచ్చేఏడాది జరిగే చిన్న జాతరకు చేసే ఏర్పాట్లు ప్రధాన జాతరకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి జాతర సమయంలోనూ వందల కోట్లు ఖర్చుచేస్తున్నా ఇంకా మట్టిరోడ్లు కనిపిస్తున్నాయన్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని, గత జాతరలలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. దేవతల గద్దెల చుట్టూ సీసీ చేయాలన్నారు. రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయినేజీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రతిపాదించాలని తెలిపారు. 2024 జాతరలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపునకు చొరవ తీసుకుంటానన్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరగనియ్యద్దని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి స్పర్శ్ పథకంలో చేరాలంటే ఈలోగా పెండింగ్ పనులన్నీ క్లియర్ కావాలని సూచించారు. కొందరు అధికారులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు.

ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు కావని, ఎండకు ఎండి, వానకు తడవాలని హితవుపలికా రు. డ్యూటీలో ఉంటూ ప్రజలను ఇబ్బంది పెడితే ఊరు కోనన్నారు. పనిచేయలేని వారు సెలవుపై వెళ్లాలని, వారి స్థానంలో సమర్థులను నియమించుకుంటామని అన్నారు. 'ములుగు వెనుకబడింది.. ఇప్పుడిప్పుడే కొన్ని అద్భుతాలు చూస్తున్నాం.. నా ప్రయత్నానికి సహకారమందించండి.. పనిచేసేవారికి నా సపోర్టు ఉంటుంది' అన్నారు. కొందరు విపక్ష నాయకులు కావాలనే ప్రభుత్వంపై తప్పుడు ప్రచా రం చేస్తున్నారని అన్నారు. వాజేడు, కొత్తగూడ మండలాల్లో తాగునీటి ఎద్దడి ఉందంటూ ప్రజలను తప్పుదోవపట్టిస్తూ ధర్నా చేయించారని దుయ్యబట్టారు. దుష్ప్రచారాన్ని అధికారులు వెంటనే ఖండించాలని, బాధ్యులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుంటామని, అలాగని పనిగట్టుకొని బురదజల్లాలనుకుంటే సహించమన్నారు.

తాగు, సాగునీటికి కొత్త ప్రాజెక్టులు

రక్షిత మంచినీరు, పుష్కలమైన సాగునీటి కోసం నియోజకవర్గానికి కొత్త ప్రాజెక్టులను తీసుకువస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. కొత్తగూడ, గంగారం మండలాలతోపాటు గోదావరి పరివాహకంలోని కన్నాయిగూడెం, తదితర మండలాలకు వీటిని కేటాయిస్తామన్నారు. కలుషిత నీటితో వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలకు సురక్షితమైన, శుద్ధమైన తాగునీటిని అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈసమావేశాలలో ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేషం, ఈఈ మాణిక్యం, డీఈ సునీత, దేవాదాయశాఖ ఈవో రాజేంద్రం, డీఎంహెచ్‌వో అప్పయ్య, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దందా లేదట!

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 25 : పంకెన ఇసుక క్వారీలో ఎలాంటి అక్రమాలు జరగడం లేదని అంటున్నారు అధికారులు. 'విచ్చల విడి దోపిడీ' శీర్షికన ఈనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై గనులు, భూగర్భ శాఖ ఏడీ జయరాజ్ స్పందించారు. క్వారీలో ఎలాంటి అక్రమాలు లేవని, ఇదంతా అవాస్తవమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే.. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పర్యటనలు మరిచిపోవడంపోవడం వల్ల ఈ దందా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. పైగా అక్రమాలు జరగడం లేదని అధికారులే చెబుతుండటంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఎక్కడో ఓ చోట అధిక లోడుతో ఇసుక లారీలు పట్టుబడుతున్నా క్వారీల్లో అక్రమాలు జరగడం లేదని చెప్పుకుంటూ అధికారులు సమస్యను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తే ఇసుక క్వారీల్లో అదనపు బకెట్ వ్యవహారం బహిర్గతమయ్యే అవకాశం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 82,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 1.90 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

రేషనలైజేషన్ జీవోను రద్దు చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి

కాటారం, సెప్టెంబరు 25: ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం తెచ్చిన రేషనలైజేషన్ జీవో 25ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ రేషనలైజేషన్ జీవో అశాస్త్రీయమైందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసేసి ప్రైవేట్‌రంగానికి ఊతమివ్వడానికే ఈ జీవో విడుదల చేశారని ఆరోపించారు.

ఐదు తరగతులుండే ప్రాథమిక పాఠశాలలో ఒకరిద్దరు టీచర్లతో నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలన్నారు. జీవో 317 బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలు, ఆర్థిక బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సేవానాయక్, ఉపాధ్యక్షులు గండు రాజబాబు, ఆలేటి సాంబయ్య, మండల అధ్యక్షుడు బొల్లం సతీష్, నాయకులు గంట రాజబాబు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, సెప్టెంబర్ 25 : మౌంటెనర్ యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్నకుమారుడైన భూక్యా యశ్వంత్ అతి చిన్న వయస్సులోనే ఆయన వయస్సుకు మించి అరచేతిలో ప్రాణాలను అడ్డుపెట్టి భయంకరమైన పర్వతాలను అధిరోహిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌డీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్యా యశ్వంత్ ఇప్పటికే సౌత్‌ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రోస్, కోజియోసిస్, యానం, కాగ్‌చేట్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతాలను అధిరోహించారు. సెప్టెంబరు 4వ తేది నుంచి 18రోజుల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి 22వ తేదిన అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ అత్యంత క్లిష్టమైన పర్వాతాన్ని సైతం జయించారు. ఓ వైపు సడలిపోతున్న రాళ్లు, మరో వైపు ప్రమాదకరమైన మెరైన్‌గ్లేసియర్‌ను తట్టుకొని అవలీలగా గోరిచెన్ శిఖరానికి చేరుకొని త్రీవర్ణ పతకాన్ని ఎగిరేశారు. దీంతో ఆయన ఖాతాలోకి మరో పర్వతం చేరింది. ఈ పర్వత శిఖర్నాన్ని ఎక్కేందుకు ఇది వరకు కేవలం ఆర్మీ జవాన్లకే అవకాశం ఉండేది. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహాయ సహకారాలు, పెద్దల దాతృత్వంతో గోరిచెన్ పర్వాతాన్ని జయించిన తొలి సివిలియన్‌గా యశ్వంత్ గుర్తింపు దేశచరిత్రలోనే గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు తనకు ఎంతో సంతోషంగా ఉందని యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పేర్కొన్నారు. యశ్వంత్ పర్వతరోహణపై మరిపెడ మండల ప్రజలు, భూక్యా తండా వాసులు, ఆయనకు ఆర్థికంగా, హర్షికంగా సహకరించిన దాతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్

సైన్స్ సెంటర్ భూములు.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

కొను గోలు చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, ఇతరులకు ద ర్జాగా అమ్మకాలు చేశారని సమాచారం. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఉద్యోగులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా హంటర్ రోడ్డులో సుమారుగా 10ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గజానికి రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా ధర పలుకుతుంది. ఈ నేపథ్యం లో పదెకరాల స్థలం కబ్జా అయితే దాని విలువ రూ.200కోట్లకు పైగానే ఉంటుందని, ఇంత జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది.

కబ్జాల వెనుక కీలక నేతలు!

సైన్స్ సెంటర్ భూముల అన్యాక్రాంతం వెనుక బడా నేతలున్నారనే చర్చ జరుగుతోంది. అడుగు జాగా కబ్జా అయితేనే అగమాగం చేసే అధికారులు వందల కోట్ల సర్కారు స్థలం కబ్జాకు గురైతే మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఈ భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లగా.. సర్వే నిర్వహించి, అక్రమణలో ఉన్నవాటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు లోకాయుక్తాకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఈ భూముల స్వాహాపై నిగ్గుతేల్చడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ కబ్జాల పర్వం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేట ర్ల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న మరో నేత కూడా కబ్జా చేసిన భూమిలోనే తిష్ట వేశారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన నేతలు, వారి అనుచరులు అక్రమార్కుల్లో ఉండటంతోనే అధికారులు భూముల సర్వేకు వెనుకాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు యంత్రాలతో గుట్టను తవ్వి పక్క సర్వే నెంబర్లతో భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం రమేష్ అనే వ్యక్తి సైన్స్ సెంటర్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా, హనుమకొండ రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి అడ్డుకున్నారు. అదే అధికారులు గత ప్రభుత్వం హయాంలో స్వాహా చేసిన కబ్జాకోరులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే నెంబరు 964, 966లో ఉన్న 49ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెంటనే టైగర్ హిల్స్(పులి గుట్ట)లో భూ సర్వే నిర్వహించాలని, కోట్లాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న వైద్యులు

పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలని పెంచాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పల్లె దవాఖాన వైద్యులు కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్ సీఐపై సీపీ అంబర్ కిషోర్ ఝాకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఒక డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిపించి అక్రమ కేసు నమోదు చేసిన సీఐ.. తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. డివిజన్‌కు చెందిన ఇద్దరు నేతలకు, అదే డివిజన్‌కు చెందిన మరోనేతకు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు నేతలు నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్న ఒక వ్యక్తితో సీఐకి ఫోన్‌చేయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిచి కేసుపెట్టడంతో పాటు చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై మనస్థాపానికి గురైన డివిజన్ నేత.. బుధవారం సీపీని కలిసి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు నేతల మెప్పు కోసం ప్రయత్నిస్తూ వివాదాల్లో ఇరుక్కుంటున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అబివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ హంటర్‌రోడ్డు ప్రాంతంలో 100ఫీట్ల రోడ్డు వద్ద నిర్మించిన సీసీరోడ్డులో పాటు సాయినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్‌తో పాటు అధికారులు బుధవారం పరిశీలించారు. కొలతలు వేసి పరిశీలించి అక్కడి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు సతీష్, హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.



కాంతులీనుతున్న.. కళా సౌధం..

ప్రారంభానికి సిద్ధమవుతున్న కాళోజి కళాక్షేత్రం

ఉమ్మడి జిల్లా సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెప్పేలా.. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. 2014లో నాటి సీఎం కేసీఆర్ జైపూర్‌లో రాజమహల్ తరహాలోని ఈ రాజసౌధానికి శంకుస్థాపన చేయగా.. రూ.85కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉండబోతోందని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఈ నేపథ్యంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో కళాక్షేత్ర భవనం ధగధగమెరిసిపోతోంది. ఇక బుధవారం ఈ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. మిగిలిన పనుల వివరాలను నిర్వహణ సంస్థ ప్రతినిధులను ద్వారా తెలుసుకున్న వారు త్వరితగతిన పూర్తిచేయాలని , ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- బాలసముద్రం(హనుమకొండ)

మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

● ఓపెన్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ఆరబెట్టిన మక్కలు
● వెయ్యి బస్తాలకుపైగా సరుకు ఆగం ● టార్పాలిన్లు ఇవ్వడంలేదని రైతుల ఆరోపణ


కేసముద్రం మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్నలను దగ్గరకు చేరుస్తున్న రైతులు


తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య రాంజీ

కేసముద్రం, సెప్టెంబర్ 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 65 మంది రైతులు 2076 బస్తాల్లో 1246 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకవచ్చారు. రైతులు తమ చెల్కల వద్ద స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు మొక్కజొన్నలను తీసుకువచ్చి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు తమ సరుకు తేమశాతం అధికంగా ఉండడంతో ఓపెన్ యార్డులో పోసుకున్నారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు తమ సరుకును కుప్పగా పోసుకొని, రక్షించుకునేంత వ్యవధి కూడా లేక సరుకు పూర్తిగా తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో వరద నీటిలో మొక్కజొన్న కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సరుకు ఆరబెట్టుకు వారిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. వర్షం వస్తున్న సమయంలో మార్కెట్ కార్యాలయంలో టార్పాలిన్లు కావాలని అడిగే లేవని సమాధానం చెప్పారని మండలంలోని పెనుగొండకు చెందిన రైతు శీలం శ్రీధర్‌తోపాటు మరికొంతమంది రైతులు ఆరోపించారు. మార్కెట్లో ఆరబెట్టుకున్న సరుకుకు తాము బాధ్యత వహించబోమని మార్కెట్ అధికారులు ఖరాకండితంగా చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండకు చెందిన తుప్పర్తి భద్ర య్య, నర్సింహులగూడెం భూక్య రాంజీ, నారాయణపురం నాంపెల్లి సురేందర్, భూక్య మంగ్యా, గుగులోత్ వెంకన్న, భవానిగడ్డతండా ధరావత్ లచ్చీరాం తదితరులకు చెందిన సుమారు వెయ్యి బస్తాలకుపైగా మొక్కజొన్నలు తడిచిపోయాయి.

నేడు బల్దియాలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతాహా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701999689 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేయాలని డాక్టర్ రాజేశ్ తెలిపారు.

30 నుంచి కేయూ మెస్‌కు దసరా సెలవులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: కాకతీయ యూనివర్సిటీలోని మెస్‌లకు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి దసరా పండువను పురస్కరించుకుని సెలవులను ప్రకటిస్తున్నట్లు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రకటించారన్నారు. కాగా, విద్యార్థులకు అక్టోబరు 15 నుంచి మెస్‌లన్నీ యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అక్టోబరు 15 తర్వాత విద్యార్థులు హాస్టల్స్ అడ్మిషన్లు రెన్యూవల్ చేసుకోవాలని వారికే భోజనం పెడతామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టుపై 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఎఎస్ఆర్ఎంవో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కేఎంసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 27 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు కేఎంసీలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రైయినీ ఎస్సైలకు పోలీసు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తూ బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పల్లె పవన్‌కు కాజీపేట, మామునూరు, బి.హేమలతకు సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివకు మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బి.సుజిత్‌కు ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధుకు జనగామ, ఇంతెజార్‌గంజ్, లింగాల దిలీప్‌కు నర్సంపేట, హసన్‌పర్తి, పి.భాగ్యశ్రీకి స్టేషన్ ఘన్‌పూర్, పరకాల పోలీసుస్టేషన్‌లకు కేటాయించారు. ప్రతీ ఎస్సైకి రెండు స్టేషన్‌లు కేటాయించారు. వీరు ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వరకు ఒక స్టేషన్, వచ్చేనెల 10 నుంచి 24వ తేదీ వరకు మరో స్టేషన్‌లో విధులపై శిక్షణ తీసుకోనున్నారు.


కేఎంసీలో జరిగిన ఉత్కర్ష వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు




వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఐదోరోజు ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ట్రెడిషనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థులు దాండిక కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ నాయక్ మృతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసూతు లక్ష్మణ్ నాయక్ (57)గుండె పోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ భౌతికకాయాన్ని పరకాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ ధరంసింగ్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేత గోవర్ధన్ నాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలను ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అందించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ వీరన్న నాయక్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మైనర్లపై కేసు నమోదుపై ఆరా

ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: మైనర్లపై కేసు నమోదుపై ప్రభుత్వం ఆరా తీసింది. దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులు నివేదికను పంపించారు. బుధవారం పత్రికల్లో మైనర్లపై కేసు నమోదుపై కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రభుత్వం నివేదికను కోరగా ఇంటెలిజెన్స్ అధికారులు పంపారు. కట్ల రాజు అనే సీఐడీ కానిస్టేబుల్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఈయనకు కూతురు ఉంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8మంది పిల్లలు రాజు కూతురిని దూషిస్తూ కారుపై గీతలు గీశారు. సీసీ ఫుటేజీ ద్వారా పిల్లలు చేసిన పనిని గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పారు. అయితే కారు రిపేరుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి 10రోజుల వరకు స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ రాజు సుబేదారి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇన్సూరెన్స్ కంపెనీ కారు డ్యామేజీకి రూ.80వేలు చెల్లించింది. కేసు విచారణలో భాగంగా పిల్లల తల్లిదండ్రులను ఎస్ఐ పిలిపించినందుకు సోషల్ మీడియాలో వైరల్ అయిందని, ఆపై పత్రికల్లో కథనాలు వచ్చాయని నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పంపించారు.

ఆ ‘పెద్ద మనిషి’ ఎవరు?

● ఆరా తీస్తున్న నిఘా వర్గాలు
● పోలీసులు మర్యాదలపై సీఎం సీరియస్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు మర్యాదలు పొందుతున్న వ్యక్తిపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం కార్పొరేషన్‌కు వచ్చిన సదరు వ్యక్తికి ఒక ఏసీపీ, సీఐలు మర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో సాధారణవ్యక్తిగా ఉన్న ఆ వ్యక్తికి ఇద్దరు గన్‌మెన్‌లు సైతం ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి విషయం హాట్ టాపిక్‌గా మారడంతో ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. అతడికి గన్‌మెన్‌లు ఎందుకు ఇచ్చారని పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అధికార పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి నష్టం కలిగే పనులు చేసేవారిని క్షమించకూడదని జిల్లా పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. సదరు వ్యక్తికి గన్‌మెన్‌లను తొలగించడంతో పాటు పార్టీకి దూరం పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. మర్యాదలు చేసిన పోలీసు అధికారులపై త్వరలో చర్యలుండే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం.

తల్లిదండ్రులు తలెత్తుకునేలా అమ్మాయిలు ఎదగాలి..

కేయూలో మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకల్లో డీసీపీ షేక్ సలీమా



యూ బ్లెడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షేక్ సలీమా, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: అమ్మాయిలు తమ తల్లిదండ్రులు తలెత్తుకునేలా జీవితంలో ఎదగాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన కళాశాల అవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ సలీమా మాట్లాడుతూ.. మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుడాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. షీటీంలపై అవగాహన ఉండాలని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంచి గుర్తింపు తెచ్చుకుని తమ కిష్టమైన రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలతో పోటీపడి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. వర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు బాగా డిమాండ్ ఉందని చెప్పారు. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు వర్సిటీ క్యాంపస్ కళాశాల అందిస్తోందని వివరించారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలని హితవు పలికారు. ఈసీ మెంబర్ డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో పేద, మధ్యతరగతి యువత చదువుకుని టెక్నాలజీరంగంలో ఎదుగుతున్నారని అన్నారు.

కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు డాక్టర్ వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి తరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, డాక్టర్ జ్యోత్స్న, అనూష, రమ, జ్యోతి ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, బోధనేతర సిబ్బంది మల్లేశం, జగన్, యాదగిరి, ఫిరోజ్, హుస్సేన్, చైతన్య, లావణ్య, నాగరాజు, తాజ్‌బాబా, ప్రమీల, మమత, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. అలాగే క్రీడాపోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా అతిథులు యూ బ్లెడ్‌యాప్‌ను ఆవిష్కరించారు. రక్తదాన ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పేర్కొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలి

హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి

కేయూలో జంతుశాస్త్రం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గీత వేముగంటి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇస్తారి తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలని హైదరాబాద్ కేంద్రియ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి అన్నారు. బుధవారం జంతుశాస్త్ర విభాగంలో రెండురోజుల జాతీయ సదస్సు క్యాంపస్‌లోని జువాలజీ సెమీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గీత కె.వేముగంటి మాట్లాడుతూ.. ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్’ అనే అంశం కీలక ప్రసంగం చేశారు. క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమన్నారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడంతో క్యాన్సర్ కణాలుగా మారుతాయని పేర్కొన్నారు. క్యాన్సర్ కణాలు శరీరంలో ఇతర విభాగాలకు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. క్యాన్సర్ చివరి దశలో ప్రాణ ప్రాయం స్థితి ఏర్పడుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో వాడే మందుల వలన రోగ నిరోధక శక్తి క్రమగా తగ్గుతోందని అన్నారు. క్యాన్సర్ మూల కణాలపై సమగ్ర పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధనలతోనే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను కనుగొనేందుకు వీలవుతుందని చెప్పారు.

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకుపోతోందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సుల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు 100మంది వరకు విలువైన పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. బెంగళూరు గీతం వర్సిటీతోపాటు ఇతర వర్సిటీ నుంచి అతిథులు హాజరుకానున్నట్లు వివరించారు. సెమినార్ సావనీర్‌ను అతిథులతో కలిసి ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మామిడాల ఇస్తారీ ఆవిష్కరించారు.


హనుమకొండ బస్టాండ్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

బాలసముద్రం, సెప్టెంబరు 25: హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ప్రయాణం చేస్తున్న ఓ వృద్ధురాలు పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి ఆ వృద్ధురాలికి అందించారు. బుధవారం ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆకుల శంకరమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తోంది. హనుమకొండలో దిగిన శంకరమ్మ తన బంగారు గొలుసు ఉన్న పర్సును బస్సులోనే మరిచిపోయింది. పర్సు పోయిందని గమనించిన ఆమె.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నవీన్, ఆర్.శ్రీధర్‌లకు విషయాన్ని తెలిపింది. వెంటనే స్పందించిన వారు శంకరమ్మ ప్రయాణించిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి బయటకు వెళ్తుండగా బస్సును నిలిపివేసి అందులో ఉన్న బంగారం, ఇతర వస్తువులు తీసుకొచ్చి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క


చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, సెప్టెంబరు 25: వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని తాళ్లగడ్డ వైజంక్షన్ వదరజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతక్క హాజరయ్యారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన తెగువ తరతరాలకు స్ఫూర్తిదాయమకని మంత్రి కొనియాడారు. దొరల పెత్తనాన్ని ధిక్కరించి బహుజన ధీరవనితగా ఐలమ్మ అనేక ప్రజా పోరాటాలు చేశారన్నారు. మహనీయుల త్యాగాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి సముచిత గౌరవం కల్పిస్తున్నారని తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటాలు చిరస్మరణీయం అన్నారు. ఆమె పోరాట పటిమను యావత్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. ఐలమ్మ ఆశయసాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ సారయ్యను రజక సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌.కె.తాజుద్దీన్, తెలంగాణ రజక సంఘం రాష్ట్ర చైర్మన్ అక్కరాజు, టీఆర్ఎస్ఎస్ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆనందం, రజక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మర్రిశెట్టి చందు, జిల్లా అధ్యక్షుడు పర్వతాల లాలయ్య, మండల అధ్యక్షుడు ముక్కెర లాలయ్య, నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు దడిగల సత్యం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కారదర్శి వావిలాల స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు అప్సర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఏటూరునాగారం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. చల్పాకలోఇటీవల అనారోగ్యంతో మరణించిన బోడ లక్ష్మయ్య, బానాజిబంధం గ్రామానికి చెందిన అట్టం నాగేశ్వరరావు, అట్టం క్రిష్ణయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు తదితరులు ఉన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు

ములుగు కలెక్టరేట్: సంక్షేమ వసతి గృహాలలో వసతులను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఉదయం ములుగులోని ఎస్టీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి సందర్శించారు. యోగ క్షేమాలు, విద్యాబోధన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి అల్పాహారం తిన్నారు. రెండు వసతి గృహాలలో డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేయాల్సి వస్తోందని, దసరా సెలవుల్లో డైనింగ్ హాళ్లను నిర్మించాలని అధికారులకు సూచించారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు. బాలికలు పట్టుదలతో ఎదగాలని, విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విద్యార్థుల యోక్షేమాలను వార్డెన్‌లు దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో దేశీరాం, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి బానోతు లక్ష్మణ్, డీవీహెచ్‌వో కొమురయ్య, డీడబ్ల్యూవో శిరీష, డీపీవో దేవరాజు, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ విజయభాస్కర్, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, ఎంపీవో రహీమొద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

ములుగు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. జిల్లాలోని ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి మంగపేట మండలం బ్రాహ్మణపల్లి వరకు 370కెమెరాలను అమర్చి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న ఎస్పీ శబరీశ్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ గీతే, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

మాదకద్రవ్యాల నిరోధక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ములుగు మండలం జాకారంలోని పీటీసీ మైదానంలో బుధవారం రాత్రి వాలీబాల్ పోటీలు జరిగాయి. వాజేడు, ఏటూరు నాగారం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లో వాజేడు గెలుపొందింది. క్రీడల ముగింపు కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఛాంపియన్‌గా నిలిచిన జట్టుతోపాటు ప్రతిభచూపిన క్రీడాకారులకు ట్రోఫీలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతే, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ శబరీశ్

కలెక్టర్ ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 25: ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర ఫేస్‌బుక్ ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. నకిలీ ఖాతాను సృష్టించి డబ్బులు కావాలంటూ బుధవారం పలువురికి మెస్సేజ్‌లు పంపారు. తాను మీటింగ్‌లో ఉన్నానని, అర్జంట్‌గా డబ్బులు కావాలని, ఫోన్‌పే చేసిన తర్వాత స్క్రీన్‌షాట్ షేర్ చేయాలని కోరారు. విషయం తెలుసుకొని వెంటనే అప్రమతమైన కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే స్పందించొద్దని తన అఫీషియల్ ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా నెటిజన్లను అప్రమత్తం చేశారు. కలెక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు ఉజ్జెకిస్తాన్ నుంచి సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపించినట్లు నిర్ధారించారు.

ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా : ఎమ్మెల్యే గండ్ర

గణపురం, సెప్టెంబరు 25: ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బస్వరాజుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జీఎస్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకు అనుగుణంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల మల్లయ్య, జంగిలి సుధాకర్, రాజూనాయక్, శ్రీను, తిరుపతి, నరేందర్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

సీసీ కెమెరాలనేర నియంత్రణకు కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూరు గ్రామపంచాయతీలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా పటిష్ఠ పర్యవేక్షణ జరుగుతుందని అన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, నాయకులు మల్హల్‌రావు, వెంకన్న, తిరుమలరావు, కావటి రవి, సంపత్‌రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మేడారం, సెప్టెంబరు 25: యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కాల్వపల్లి గ్రామానికి చెందిన నల్లమొక్క రంజిత్ కుటుంబ సభ్యులతో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో మనస్తాపం చెంది బయటకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న బాత్‌రూం క్లీనర్ తాగి కుంటుంబ సభ్యులకు ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆ యువకుడి సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా ఆచూకీ కనుగొన్నారు. నార్లాపూర్- పస్రా రోడ్డులోని అటవీ ప్రాంతంలో అస్వస్థతకు గురైన రంజిత్‌ను గుర్తించి ఆస్పత్రికి తరలించారు.

కోటగుళ్లను సందర్శించిన విజిలెన్స్ కమిషనర్

గణపురం, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడం కోటగుళ్లను రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గిరిధర్ గోపాల్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. గతంలో ములుగులో ఐటీడీఏ పీవోగా, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా పనిచేశానని తెలిపారు. ఆ సమయంలో కోటగుళ్లకు రాలేకపోయానని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజేందర్, ఆర్ఐలు దేవేందర్, రహ్మత్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న విజిలెన్స్ కమిషనర్ గిరిధర్ గోపాల్

'తపస్' మండల అధ్యక్షురాలిగా అరవింద

రేగొండ, సెప్టెంబరు 25: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మండల నూతన అధ్యక్షురాలిగా కొక్కొండ అరవింద, ప్రధాన కార్యదర్శిగా మండ శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ములకుల్ల తిరుపతి ఈ మేరకు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పత్తి వెంకట రామిరెడ్డి, జిల్లా బాధ్యులు విజయ్‌కుమార్ భాస్కర్‌రావు, నూతి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్‌వో మధుసూదన్

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 25: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రంగాపూర్, ఇస్సిపేట గ్రామాల్లోని సబ్ సెంటర్లు, పోషణ్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లను ఆయన తనిఖీలు చేశారు. సిబ్బంది, హాజరు రిజిస్టర్లను పరిశీలించి వాక్సినేషన్ మందులను, ల్యాబ్ టెక్నీషియన్ గదిని పరిశీలించారు. డాక్టర్ నాగరాణిని ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య అధికారి డాక్టర్లు నాగరాణి, నవత ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల, సెప్టెంబరు 25: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన తూటిచర్ల నర్సయ్య, కొత్తపేటకు చెందిన మధుర కవి దినేష్, ఒడితలకు చెందిన యాంసాని భద్రయ్య, కోడూరి రాజసమ్మయ్య, అందుకుతండాకు చెందిన భూక్య పూల్‌సింగ్ నాయక్ చిత్రపటాల వద్ద నివాళ్లు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాంబాబు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు తొటం నవీన్, నాయకులు మడికొండ రవీందర్‌రావు, భైరం భద్రయ్య, రాజునాయక్, అల్లం రవీందర్, వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్ ఉన్నారు.


మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సరోత్తం రెడ్డి

చిట్యాల, సెప్టెంబరు 25: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ అనుబంధ రిటైర్డ్ టీచర్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సరోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాలలో గురువందన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులను, ఏమ్మార్సీ సిబ్బందిని సత్కరించారు. అనంతరం సరోత్తం రెడ్డి మాట్లాడుతూ భారత్‌ను విశ్వగురువుగా నిలపడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఎంఈవో కోడేపాక రఘుపతి, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో రామకృష్ణ, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కానుగుల రఘుపతి, గోపగాని భాస్కర్, బుర్ర సదయ్య, తిరుపతి, వెంకట్రామిరెడ్డి, పీజీ హెచ్ఎం కృష్ణ జాన్సీ, మహేందర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాకతీయఖని, సెప్టెంబరు 25: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు అధికారులు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మూడు సంవత్సరాల్లో 51 నుంచి 100 మస్టర్ల కన్నా తక్కువ ఉన్న 108 మంది కార్మికులను ఆహ్వానించగా 46 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్‌చార్జి జీఎం కవీంద్ర కార్మికుల గైర్హాజరు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి సలహాలు, సూచనలు ఇచ్చి విధులకు సక్రమంగా హాజరు కావాలని అన్నారు. ఏరియా రెస్క్యూ స్టేషన్‌లో జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, అధికారులు జ్యోతి, కావూరి మారుతి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

మంగపేట, సెప్టెంబరు 25: పీఆర్టీయూ టీఎస్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లందుల హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా పాలడగుల రవి, అసోసియేట్ అధ్యక్షురాలిగా జి.శాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొయ్యడ సురేందర్, రౌతు రాజు సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.

కేటీఆర్ సేన అధ్యక్షుడిగా ప్రవీణ్

గణపురం, సెప్టెంబరు 25: కేటీఆర్ సేన మండల అధ్యక్షుడిగా కర్రె ప్రవీణ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కేటీఆర్ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి తెలిపారు.

8న గిరిజన టీచర్ల ధర్నా

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 25: గిరిజన సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకువిజయవంతం చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్ కోరారు. మండలంలోని భూర్గుపేట ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్, భూర్గుపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం

మంగపేట, సెప్టెంబరు 25: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు వేగవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కోరారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని మంగపేట, గంపోనిగూడెం గ్రామాల్లో బుధవారం బీజేపీ మెగా మెంబర్‌షిప్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మండల లవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ నుంచి 200 సభ్యత్వాలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, జిల్లా కన్వీనర్ జాడి వెంకట్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్‌పాషా, మండల ప్రధాన కార్యదర్శి చల్లా రాంకి, సీనియర్ నాయకులు యెర్రంకాని వీరన్‌కుమార్, జానకిరావు, రాంటెంకి సమ్మయ్య, సామా మోహన్‌రెడ్డి, బొల్లికొండ సాంబయ్య, నిడుదవోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 25: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఐదో విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్లల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 వరకు చివరి గడువు ఉందని తెలిపారు.

● ఏటూరునాగారం: ములుగు జిల్లాల్లోని ఏటూరునాగారం, వాజేడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఐదో విడత దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఫిట్టర్ ట్రేడుల్లో ఖాళీలున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పైప్‌లైన్ లీకేజీలపై శిక్షణ

వాజేడు, సెప్టెంబరు 25: గ్రామాల్లో మంచి నీటిని సరఫరా చేసే గ్రామ సహాయకులకు పైప్‌లైన్ లీకేజీలపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణను ఇచ్చారు. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, జేఈ శైలజ పాల్గొన్నారు. పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడితే ఎలా మరమ్మత్తులు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పైప్‌లైన్‌ల నిర్వహణను ఎలా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 28వరకు ఉంటుంది.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 25: జిల్లాలోని నర్సాపురం, ఏటూరునాగారం, తాడ్వాయి, చుంచుపల్లి ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా ఇన్‌స్ట్రకర్లను నియమించనున్నట్టు ఆయుష్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.లీచంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ సెంటర్‌లో ఒక స్త్రీ, ఒక పురుష ఇన్‌స్ట్రక్టర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. కనీసం ఇంటర్ విద్యార్హత, యోగా సర్టిఫికెట్ కోర్సు చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 7097057081 నంబరును సంప్రదించాలని సూచించారు.

కాటారానికి టీజీఎస్‌పీ ప్లాటూన్ రాక

కాటారం, సెప్టెంబరు 25: కాటారం పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌గా పోలీస్‌శాఖ తెలంగాణ స్పెషల్ పోలీస్(టీజీఎస్‌పీ) ప్లాటూన్‌ను కేటాయించగా ఆర్ఎస్సైతో పాటు సిబ్బంది విధుల్లో చేరారు. వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలోని నాలుగో బెటాలియన్ డీ కంపెనీకి చెందిన టీజీఎస్పీ సిబ్బందిని కాటారానికి కేటాయించారు. దీంతో ఆర్ఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌తో కూడిన 30 మంది బృందం కాటారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్యాంపు ఏర్పాటు చేసుకుంది. 20 ఏళ్ల క్రితం నుంచి శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టుల నియంత్రణకు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉండగా ఇటీవల సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఎత్తివేసి బలగాలను మణిపూర్‌కు తరలించారు. కొన్ని రోజులుగా 10మంది టీజీఎస్పీ సిబ్బంది కాటారం పోలీస్‌స్టేషన్‌లో సెంట్రీతోపాటు ఇతర విధులు చేశారు. వారిని సబ్ డివిజన్‌లోని ఇతర ప్రాంతానికి పంపించి నూతనంగా 30మందితో కూడిన టీజీఎస్పీ ప్లాటూన్‌ను కాటారానికి కేటాయించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గతంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉన్న భవనాలు, బ్యారక్‌లోనే వీరు ఉంటూ విధులు నిర్వర్తించనున్నట్లు సమాచారం.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి : సీపీఎం

గోవిందరావుపేట, సెప్టెంబరు 25: పస్రా గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిట్టబోయిన రమేష్, కందుల రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామ మహాసభలో కృష్ణారెడ్డి మాట్లాడారు. జనాభాకు అనుగుణంగా పస్రా అభివృద్ధి చెందలేదన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందన్నారు. వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో 570 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంచామని, వాటికి పట్టాలు జారీ చేయడంతోపాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, నాయకులు అంబాల పోశాలు, పొదిళ్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీని పునరుద్ధరించాలి : బీఎస్పీ

గోవిందరావుపేట, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోని సైడ్ డ్రెయినేజీని పునరుద్ధరించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు కోగిల అజయ్‌కుమార్ అధికారులను కోరారు. బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. 13, 14వార్డుల్లో గతేడాది అస్తవ్యస్తంగా నిర్మించిన డ్రెయినేజీలో కాల్వల్లో నీరు నిల్వ ఉండి పారిశుధ్యం లోపిస్తోందని, దోమలు పెరిగి కాలనీ వాసులు అనారోగ్యంపాలవుతున్నారని తెలిపారు.

కేజీబీవీ వసతి గృహాన్ని సందర్శించిన జీసీడీవో

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 25: మండలంలోని జవహర్‌నగర్ కస్తూర్బా పాఠశాల వసతిగృహాన్ని గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (జీసీడీవో) మంగళవారం రాత్రి సందర్శించారు. విద్యార్థినులతో కలిసి అక్కడే రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వారంలో ఒకరోజు హాస్టళ్లలో రాత్రి బస చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సందర్శించానని ఆమె తెలిపారు. ఆమె వెంట స్పెషల్ ఆఫీసర్ వసంత లక్ష్మి, నైట్ డ్యూటీ టీచర్ దేవి తదితరులు ఉన్నారు.

రావణవధ ఉత్సవ కమిటీ ఎన్నిక

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 25: విజయదశమిని పురస్కరించుకొని ఏటా ములుగులో నిర్వహించే రావణాసుర వధ ఉత్సవ నిర్వహణ నూతన కమిటీని ఖరారు చేశారు. బొడ్రాయి ప్రాంగణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండ్రకోట కుమార్‌తోపాటు 150 మంది సభ్యులతో కమిటీని ఖరారు చేశారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మేడారం, సెప్టెంబరు 25: కోతుల దాడిలో వృద్ధురాలు గాయపడిన సంఘటన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపాలపురం మణెమ్మ కిరాణా సరుకులు తీసుకెళ్లుండగా ఒక్కసారిగా కోతులు మీదపడి కరిచాయి. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మణెమ్మను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నంబర్ ప్లేట్ లేకుంటే వాహనాలు సీజ్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 25: నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి కోర్టులో అప్పగిస్తామని ట్రాఫిక్ ఎస్సై సి.హెచ్. శ్రీనివాస్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రతీ రోజు 10 నుంచి 15 వాహనాల వరకు నెంబర్ ప్లేట్లు లేకుండా పట్టుబడుతున్నాయన్నారు.

శ్రీధర్‌బాబును కలిసిన 'దళితబంధు' నేతలు

మహదేవపూర్, సెప్టెంబరు 25: మంత్రి శ్రీధర్‌బాబును దళితబంధు సాధన సమితి నేతలు బుధవారం కలిశారు. దళితబంధు నిధులకు ఎన్నికల కోడ్ రావడం వల్ల అంతరాయం ఏర్పడిదని, రెండో విడతగా డబ్బులు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సంపత్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాటారానికి ఇద్దరు పీఎస్సైలు

కాటారం, సెప్టెంబరు 25: కాటారం పోలీస్‌స్టేషన్‌కు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, రాజన్‌కుమార్ అనే ఇద్దరు ప్రొబేషనరీ ఎస్సైలను కేటాయించారు. దీంతో బుధవారం వారు కాటారం పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరారు. ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేసుకుని వచ్చిన 11 మంది పీఎస్సైలను ఎస్పీ కిరణ్‌ఖరే వివిధ పోలీస్‌స్టేషన్లకు కేటాయించారు.

టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక

కాటారం, సెప్టెంబరు 25: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కాటారం మండల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. మండలకేంద్రంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల పరిశీలకుడు బానోత్ సేవానాయక్ నేతృత్వంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా బొల్లం సతీష్ ప్రధాన కార్యదర్శిగా గండు రాజబాబు, ఉపాధ్యక్షులుగా ఆర్.సంపత్, ఏ శ్రీలత, కార్యదర్శులుగా పరికిపండ్ల రవీందర్, ఎలబోయిన శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్లుగా గుగులోత్ జయరాజ్, గంట రాజబాబు ఎన్నికయ్యారు.